ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.3 కనిష్ఠం 23.5



స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జీవీపీ(గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్)లను తొలగించి చెత్తకుప్పలు లేని నగరంగా గతంలో కొంత మెరుగైన ర్యాంకు సాధించారు. బిన్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దినందుకే అవార్డు లభించిందని జీహెచ్ఎంసీ అప్పట్లో ఆర్భాటంగా ప్రకటించింది. కానీ కొన్నాళ్లకే పరిస్థితి షరామామూలుగా మారింది. ర్యాంకుల కోసం పనిచేస్తున్న అధికారులు పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణపై చిత్తశుద్ధి కనబరచడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చెత్తశుద్ధి కరువు

- నగరంలో జీవీపీల తొలగింపు కష్టమే
- రోడ్లపై పెరుగుతోన్న చెత్తకుప్పలు
- ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియపై తీవ్ర విమర్శలు
- క్షేత్రస్థాయిలో పర్యటించని అధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలో వెయ్యి ప్రాంతాల్లో ఉన్న జీవీపీ(గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్)లను నెల రోజుల్లో తొలగించాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్ ఇటీవల జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. అయితే క్షేత్రస్థాయిలో ఇది సాధ్యమా..? అంటే అంత సులువు కాదని అధికారులే చెబుతున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ప్రస్తుతం నగరంలో 1506 జీవీపీలు ఉండగా అనధికారికంగా వీటి సంఖ్య మరింత ఎక్కువగానే ఉంటుంది. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించకుండా.. ఇంటింటి చెత్త సేకరణ ప్రక్రియను మెరుగుపరచకుండా, స్వచ్ఛట్రాలీలపై నియంత్రణ లేకుండా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడాన్ని నిలువరించడం సాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్షేత్రస్థాయిలో కనిపించని అధికారులు

నగరంలో ఇంటింటి చెత్త సేకరణకు 4,480 స్వచ్ఛ ట్రాలీలను జీహెచ్ఎంసీ అందజేసింది. ఒక్కో ట్రాలీకి 300 నుంచి 600 వరకు ఇళ్లు కేటాయించారు. ప్రతి ఇంటి నుంచి నిత్యం చెత్త సేకరించాల్సి ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించడం లేదు. మెజార్టీ ప్రాంతాల్లో రోజు విడిచి రోజు.. కొన్ని చోట్ల వారంలో ఒకటి, రెండు పర్యాయాలు మాత్రమే సేకరణ జరుగుతోంది. చెత్త సేకరణకు ప్రతినెలా రూ.80 నుంచి రూ.150 వరకు వసూలు చేస్తుండటంతో ఇళ్లలోని చెత్తను నగరవాసులు రోడ్లపైనే వేస్తున్నారు. గతంలో స్వచ్ఛ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయగా వాటిని కొందరు కార్మికులు ఆదిలోనే తొలగించారు. అప్పుడు పట్టించుకోని అధికారులు ఇప్పుడు మరోసారి అన్ని వాహనాలకు జీపీఎస్ అమరుస్తున్నారు. అయితే సర్కిళ్ల వారీగా పారిశుధ్య నిర్వహణను పర్యవేక్షించాల్సిన ఏఎంఓహెచ్/డీఈఈలు క్షేత్రస్థాయిలో పర్యటించడం తగ్గించారు. లోకేష్‌కుమార్ కమిషనర్‌గా ఉన్నప్పుడు డిప్యూటీ/అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు నిర్దీత రోజుల్లో ఉదయం వేళల్లో స్వీపింగ్, చెత్త సేకరణను పరిశీలించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన బదిలీ అనంతరం పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

ఇండోర్‌లో ఇలా..

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ పట్టణం ఏడేళ్లుగా స్వచ్ఛ ర్యాంకుల్లో మొదటి స్థానంలో నిలుస్తోంది. ఇక్కడ ఇంటింటి చెత్త సేకరణపై మున్సిపల్ కార్పొరేషన్‌కు పూర్తి నియంత్రణ ఉంది. 6.5 లక్షల ఇళ్ల నుంచి నిత్యం 692 టన్నుల తడి, 683 టన్నుల పొడి, 179 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నారు. నిత్యం చెత్త సేకరణ జరుగుతోందా..? లేదా..? అని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. సేకరణ సక్రమంగా జరగకుంటే ఫిర్యాదు చేసేలా కాలనీ, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లను భాగస్వాములను చేశారు. ఇందుకు భిన్నంగా హైదరాబాద్‌లో చెత్త సేకరణ జరుగుతోంది.

ప్రైవేట్ సంస్థలకు తరలింపు ప్రక్రియ

రోడ్ల పక్కన చెత్త తొలగింపు బాధ్యతలను ప్రైవేట్‌కు అప్పగించి జీహెచ్ఎంసీ చేతులు దులుపుకుంది. ఒప్పందం ప్రకారం రోజూ నాలుగు పర్యాయాలు చెత్త తొలగించి సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లకు తరలించాలి. కానీ ప్రస్తుతం కేవలం రెండు సార్లు, ప్రముఖులు ఉండే ప్రాంతాల్లో మూడు పర్యాయాలు చెత్త తరలిస్తున్నారు. దీంతో చాలాప్రాంతాల్లో ఎక్కడి చెత్తను అక్కడే పేరుకుపోతోంది. సామాజిక మాధ్యమాలు, జీహెచ్ఎంసీ మొబైల్ యాప్‌లో పారిశుధ్య నిర్వహణపై ఫిర్యాదులు పెరిగాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం విడ్డూరం.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సురేష్ కుమార్

మహిళను హత్య చేసి..
రేప్ సీన్‌గా మార్చి

- పోలీసులకు పట్టుబడిన మరో మహిళ

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): 'నా ఇంటిపైకి వచ్చి నన్నే బెదిరిస్తావా? రేపు ఎంతకైనా తెగిస్తావు. మున్ముందు నా వృత్తికి అడ్డువచ్చే అవకాశాలు లేకపోలేదు' అని ఓ మహిళ.. మరో మహిళను చంపేసింది. ఎవరో అత్యాచారం చేసి, హత్య చేసినట్లుగా చిత్రీకరించి పోలీసులకు దొరికిపోయింది. కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ బోదన్ ప్రాంతానికి చెందిన ధర్మారం ప్రియాంక (23) రెండు నెలల క్రితం కేపీహెచ్‌బీకి వచ్చి వేశ్యవృత్తి చేస్తోంది. ఈక్రమంలోనే తాండూర్ ప్రాంతానికి చెందిన మంజుల (35)తో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇద్దరూ అదే వృత్తిలో ఉన్నారు. ప్రియాంక తన వెండి ఆభరణాలను భద్రపరచాలని మంజుల వద్ద ఉంచింది. తాను ఎల్లమ్మబండ ఎన్టీఆర్‌నగర్‌లో అద్దెకు ఉంటున్నానని, భద్రంగా ఉంచుతానని మంజుల చెప్పింది. సెప్టెంబర్ మూడోవారంలో తన ఆభరణాలుఇవ్వాలని అడగగా, మంజుల లేవని చెప్పడంతో ఇద్దరి

మిగతా 8వ పేజీలో..

'పెద్దమ్మ'కు దసరా కళ





దసరా నవరాత్రుల నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయం భక్తులతో కళకళలాడుతోంది. ఆదివారం గాయత్రీ దేవిగా పెద్దమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చింది.

బస్టాండ్లలో పండుగ రద్దీ

- 550 ప్రత్యేక బస్సుల్లో సొంతూళ్లకు..

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పండుగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో ఎంజీబీఎస్, జేబీఎస్‌తో పాటు ఆరాంఘర్, ఉప్పల్ ప్రాంతాలు రద్దీగా మారాయి. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రద్దీ ఎక్కువగా ఉండటంతో తెలంగాణలోని పలు జిల్లాలకు అధిక సంఖ్యలో స్పెషల్ సర్వీసులను నడిపినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. జేబీఎస్, ఆరాంఘర్ నుంచి 200 స్పెషల్ బస్సులు జిల్లాలకు తరలి వెళ్లగా, ఉప్పల్ నుంచి 115, ఎంజీబీఎస్ నుంచి 124, ఎల్బీనగర్, మెహిదీపట్నం నుంచి 11 ప్రత్యేక బస్సులను నడిపారు. ఆదివారం రాత్రి 12 గంటల వరకు మరో వందకు పైగా స్పెషల్ సర్వీసులు జిల్లాలకు వెళతాయని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను పెంచుతున్నామన్నారు.



ఎంజీబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ

స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

హైదరాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): క్రీడలు ఆరోగ్యంగా ఉంచడమే కాకుండా క్రమశిక్షణ, టీమ్‌వర్క్, ఎనర్జిటిక్‌గా ఉండడాన్ని నేర్పుతాయని అటవీ శాఖ ప్రధానాధికారి ఆర్.ఎం.డోబ్రియాల్ తెలిపారు. దూలపల్లి తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో 7వ రాష్ట్ర స్థాయి అటవీశాఖ అధికారుల స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని డోబ్రియాల్ ప్రారంభించారు. 815 మంది క్రీడాకారులు స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నారు. దీనిలోభాగంగా బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్, టెన్నిస్, టేబుల్‌టెన్నిస్ ఈవెంట్లను నిర్వహిస్తున్నారు.

రన్ ఫర్ గ్రేస్





రన్ ఫర్ గ్రేస్ పేరుతో గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో నిర్వహించిన 2కే, 5కే, 10కే రన్‌లో నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.



- గడిచిన ఐదేళ్లలో 40వేల ఎకరాల్లో సాగు తగ్గుముఖం
- గణనీయంగా పడిపోయిన ఉత్పత్తులు
- నగర వాసుల అవసరాలకు బయట నుంచే అధిక సరఫరా
- శివార్లలో పట్టణీకరణ కూడా కారణం
- ఉద్యాన జోన్‌పై కాంగ్రెస్ సర్కార్ మౌనం

కూరలు కష్టమే!

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఏటా తగ్గుతున్న కూరగాయల సాగు

ఇష్టమైన కూరతో కడుపు నిండా భోజనం చేద్దామనుకునే వారికి ఇది నిజంగా చేదు వార్తే. ఇష్టమైన కూరగాయలు దొరకడం ఇక కష్టమే. ఒక వేళ దొరికినా వాటిని కొనే పరిస్థితి ఉండకపోవచ్చు. కూరగాయల కోసం అంత కష్టం ఏముంటుంది అనుకుంటున్నారా.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నానాటికి కాయగూరల సాగు విస్తీర్ణం భారీగా పడిపోతోంది. ఉత్పత్తులు భయంకరంగా తగ్గుతున్నాయి. కేవలం ఐదేళ్లలోనే 40 వేల ఎకరాల్లో సాగు తగ్గిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కూరగాయల సాగుకు సర్కారు సరైన ప్రోత్సాహం ఇవ్వకపోవడం, పట్టణీకరణ పెరుగుతుండడమే దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : హైదరాబాద్ మహానగరానికి అవసరమైన కూరగాయలను అధిక శాతం సమకూర్చే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో క్రమేపీ కూరగాయ పంటల సాగు తగ్గిపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గడిచిన అయిదేళ్లలో దాదాపు 40వేల ఎకరాల్లో కూరగాయ పంటల సాగు తగ్గింది. పట్టణీకరణ నేపథ్యంలో నగర శివార్లలో ఉద్యాన పంటలు సాగుచేసే భూములన్నీ కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతున్నాయి. దీనికి తోడు వెజిటబుల్ హబ్‌గా ఉన్న ఈ ప్రాంతంలో కూరగాయలు పండించే రైతులకు సరైన ప్రోత్సాహకం లభించడం లేదు. దీంతో కూరగాయ పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న ఉమ్మడి జిల్లాలో అన్ని సీజన్‌లలో కూరగాయలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, శంషాబాద్, షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ, మొయినాబాద్, చేవెళ్ల, మర్పల్లి, పరిగి, శంకరపల్లి, మేడ్చల్, శామీర్‌పేట, కీసర తదితర ప్రాంతాల రైతులు ఎక్కువగా కూరగాయ పంటలు సాగు చేస్తున్నారు. వీరంతాపండించిన పంటను హైదరాబాద్‌లోని వివిధ మార్కెట్లకు, రైతు బజార్లకు తరలిస్తున్నారు. అయితే గడిచిన



మిగతా 8వ పేజీలో..


రాజేంద్రనగర్‌లోని హరిహరక్షేత్రంలో అన్నపూర్ణాదేవిని దర్శించుకుంటున్న భక్తులు


నందిముస్లైగూడలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ కిషన్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడు సాయికిరణ్, తదితరులు


గౌలిపురా డివిజన్ పటేల్‌నగర్‌లో పూజలు చేస్తున్న బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి సుమన్‌కుమార్, తదితరులు

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని ఆదివారం అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల ఉత్సవ కమిటీ నిర్వాహకులు అన్నదానం చేశారు. - జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి


నాంపల్లిలోని కట్టమైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న టీపీసీసీ కార్యదర్శి మనీలాల్ షా, తదితరులు


అన్నపూర్ణాదేవిగా అమ్మవారు


మీరాలంమండి మహాకాళేశ్వర ఆలయంలో లలితా త్రిపుర సుందరిదేవిగా అమ్మవారు


బషీర్‌బాగ్‌లోని శ్రీ కనకదుర్గ నాగలక్ష్మి అమ్మవార్లను దర్శించుకున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సత్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రామచంద్రరాజు, ఆలయ చైర్మన్ రామరాజు, గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖఓంప్రకాశ్, సభ్యులు


మహాకాళేశ్వర ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో భక్తులు


ఉస్మాన్‌గంజ్‌లోని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు కేతం రాధాకృష్ణ నేతృత్వంలో నిర్వహించిన లలితా సహస్ర నామ పారాయణంలో మహిళలు


న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను సన్మానిస్తున్న గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ లింగ్విస్టిక్ మైనార్టీ సెల్ చైర్మన్ ఎన్.కె.సింగ్ తదితరులు
● అఫ్జల్‌గంజ్, ఆంధ్రజ్యోతి

నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటులో కుట్ర

పూడూరు, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటు చేసి మూడు నదులు పుట్టుక నేలను ఎడారిగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం వికారాబాద్ జిల్లా, పరిగి నియోజకవర్గం పూడూరు మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో బహుజన బతుకమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఈసీ, మూసీ, కాగ్నా నది పుట్టకతోనే హైదరాబాద్ సస్యశ్యామలంగా ఉందని, తాగు, సాగునీటికి కరువు లేదని అన్నారు. ప్రకృతికి హాని కలిగించే నేవీరాడర్‌ను మరెక్కడైనా భూమిని కొనుగోలు చేసి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ స్థానికులను కాదని రాడర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే ఇటువంటి ప్రాజెక్టు ఏర్పాటు కానివ్వమని హెచ్చరించారు.


ఫిర్యాదు కాపీని చూపిస్తున్న ఆశిశ్‌కుమార్‌యాదవ్, తదితరులు

కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఫిర్యాదు

అఫ్జల్‌గంజ్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ నాయకుడు ఆశిశ్‌కుమార్ యాదవ్ ఆదివారం సీసీఎస్ ఏసీపీకి, ఆబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజలిచ్చిన అవకాశాన్ని వదిలేసి సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూషణం, కోటి శైలేష్ కురుమ తదితరులు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్తను కించపరిచిన నర్సింగానందపై చర్యలు తీసుకోవాలి


బాలాపూర్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ముస్లింలు

పహాడిషరీఫ్ అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి): ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని ఓ సభలో యతి నర్సింగానంద మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్తను కించపరుస్తూ పలు వాఖ్యలు చేశారు. ఈ వీడియోలు వైరల్ కావడంతో ముస్లిం నాయకులు యతి నర్సింగానందపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహ్మద్ ప్రవక్తను కించపరుస్తూ మాట్లాడిన యతి నర్సింగానందను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని జల్‌పల్లి మాజీ మండల అధ్యక్షుడు ఉమర్‌బామ్, షాకేర్‌బేగ్ ఆదివారం బాలాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఇక్రమ్ అలీ, నూరిసహాబ్, సాయద్ ఇమ్రాన్ క్వాద్రి, మహ్మద్ ముస్తఫా సూఫియాని, సాయిద్ బిన్ హాజబ్, మహ్మద్ జీలాని సోఫియాని, అహ్మద్ ఖాన్, సాయిద్, సాబేర్, మహ్మద్ రిజవాన్, మహ్మద్ అజామ్ ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన అనుబంధ యూజీ కోర్సులకు కౌన్సెలింగ్

● రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి

రాజేంద్రనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన అనుబంధ యూజీ కోర్సులకు ఈనెల 14 నుంచి 19 వరకు రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 9 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నర్సింహారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయాలలో అందిస్తున్న బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చరల్, బీఎస్సీ(హానర్స్) కమ్యూనిటీ సైన్స్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ అస్బెండరీ, బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్, బీఎస్సీ(హానర్స్) హార్టికల్చరల్ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరానికిగాను ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కౌన్సెలింగ్ షెడ్యూల్, ఇతర షెడ్యూల్, ఇతర వివరాల కోసం అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను లేదా www.pjtsau.edu.in ను సందర్శించాలని రిజిస్ట్రార్ సూచించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

● భవన నిర్మాణ కార్మికుడు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు


రాజు(ఫైల్)

రాజేంద్రనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మైలార్‌దేవుపల్లి సమీపంలోని దుర్గానగర్ చౌరస్తాలో ఆదివారం ఉదయం 6:30 గంటలకు వేగంగా వచ్చిన లారీ ముందు వెళ్తున్న ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట్ జిల్లా ధన్వాడ మండలం, కిష్టాపూర్ గ్రామానికి చెందిన బోయిన్‌పల్లి రాజు, భారతమ్మ భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి అత్తాపూర్‌లో నివాసం ఉంటున్నారు. రాజు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం తన బైక్(టీఎస్07 ఈడబ్ల్యూ 0119)పై స్నేహితుడు రమేశ్‌తో కలిసి చాంద్రాయణగుట్ట వైపు వెళ్తున్నాడు. దుర్గానగర్ చౌరస్తా వద్దకు రాగానే వెనకాల నుంచి వేగంగా వచ్చిన లారీ(టీఎస్13టీ 0990) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజు(36) అక్కడికక్కడే మృతిచెందాడు. రమేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మైలార్‌దేవుపల్లి ఎస్ఐ సత్యకుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. రాజు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ రేసర్లకు జరిమానా

రాజేంద్రనగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దగా శబ్దాలు చేస్తూ బైక్ రేసింగ్‌లకు పాల్పడుతున్న ఆరుగురు యువకులకు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. ఆదివారం ఉదయం పీడీపీ చౌరస్తా నుంచి ఆరాంఘర్ వైపు బైక్ రేసింగ్‌కు పాల్పడుతున్న ఆరుగురు ద్విచక్రవాహనదారులను రాజేంద్రనగర్ ట్రాఫిక్ అడిషనల్ ఇన్‌స్పెక్టర్ నర్సింహగౌడ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌తో కలిసి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. వాహనాల సైలెన్సర్‌లను తొలగించి, వాహనదారులకు జరిమానా విధించారు. రోడ్లపై బైక్ రేసింగ్‌కు పాల్పడవద్దని హెచ్చరించారు.

ప్రకృతి మాతకు కృతజ్ఞత ప్రకటనే బతుకమ్మ

● మంత్రి సీతక్క


బతుకమ్మ ఆడుతున్న మంత్రి సీతక్క

రవీంద్రభారతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి మాతకు కృతజ్ఞత ప్రకటనే బతుకమ్మ పండుగ అని రాష్ట్ర మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రవీంద్రభారతి వేదికగా జరుపుతున్న బతుకమ్మ వేడుకలకు ఆదివారం ఆమె హాజరయ్యారు. వందలాది మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. బతుకమ్మ పాటలు పాడుతూ కళాకారులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డలకు అపురూపమైన పండుగని అన్నారు. మనుషుల్లో గొప్ప శక్తిని, సామర్థ్యాన్ని వెలికితీసి బతుకు పట్ల, జీవితం పట్ల సానుకూల దృక్పథాన్ని ఏర్పరిచే పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

గ్లోబల్ హిందూ ఫెడరేషన్ మొబైల్ అప్లికేషన్ ప్రారంభం

రవీంద్రభారతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా హిందూ సంస్థలను ఏకతాటిపైకి తీసుకురావడంలో ముఖ్యమైన మైలురాయిని సాధించడంలో భాగంగా గ్లోబల్ హిందూ ఫెడరేషన్ మొబైల్ యాప్‌ను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో గ్లోబల్ హిందూ ఫెడరేషన్ యాప్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సుభాష్ అగర్వాల్, కమ్లేష్ మహరాజ్, బంగారయ్య శర్మ, యోగీష్ ప్రభు, వీరధర్మజ స్వామి, శ్యాం సుందర్, కొత్తకొండ రాజు, జిగ్నేష్ జోషి, నందికొండ రమేష్, గోవింద్ రాజు, గాయత్రి, దేవిక, పరమేశ్వరి, అనిల్ కటికర్, మదన్‌గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, గ్లోబ్ యాప్ చైర్మన్ సీడీ ఛవాన్ యాప్‌కు సంబంధించిన వివరాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందూ సంస్థలను ఐక్యం చేయడమే లక్ష్యంగా యాప్‌ను రూపొందించామని పేర్కొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో ఉత్తమ ప్రతిభ


విఘ్నేష్ యాదవ్

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదని బేలాకు చెందిన ఓ బాలుడు నిరూపించాడు. బెంగళూరు రామయ్య విశ్వవిద్యాలయంలో జరిగిన మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ జాతీయస్థాయి పోటీల్లో 12 ఏళ్ల విభాగంలో బేలా ప్రాంతానికి చెందిన పొటేల్ విఘ్నేష్ యాదవ్ బంగారు పతకం సాధించాడు. డిసెంబర్‌లో ఇండోనేషియాలో జరగనున్న ప్రపంచస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. స్థానికులు విఘ్నేష్‌ను ఆదివారం అభినందించారు.


సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు

'అన్నివర్గాలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి'

చాంద్రాయణగుట్ట, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నివర్గాలకు చెందిన ప్రజలు బీజేపీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని, ఇది శుభపరిణామమని ఆ పార్టీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కళ్యాణ్ నాయక్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఎస్టీ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు ఇస్లావత్ గోపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును నిర్వహించారు. బీజేపీ నాయకులు కృష్ణానాయక్, ప్రవీణ్ రాథోడ్, విశాల్‌నాయక్, పండరినాథ్, ప్రభాకర్, జానీ, జగదీష్, రమేశ్ నాయక్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై ఆందోళన


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

బర్కత్‌పుర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో ప్రధానంగా మాల, బేగరి, నేతకాని, దాసరి, మహార్ వంటి కులాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ రెండో వారంలో దళితుల తిరుగుబాటు పేరుతో 'వర్గీకరణ వద్దు - రాజ్యాధికారం కావాలి' అనే నినాదంతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వి.ఎల్.రాజు, రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎస్.రావు, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు సిహెచ్ రోజాలీల, సుబ్బారావు, అశోక్, తీగల శేఖర్, పబ్బతి శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించకపోతే ఉద్యమిస్తాం

● ఎమ్మెల్యే వివేకానంద్


ధర్నాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తదితరులు

జీడిమెట్ల, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ వరకు మెట్రోను విస్తరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో జీడిమెట్ల గ్రామం గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫోర్త్‌సిటీ పేరుతో ఊహలనగరానికి మెట్రో విస్తరించాలనుకోవడం, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మెట్రోరైల్ కోసం సర్వే చేసిన కొంపల్లి, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట్ ప్రాంతాలను విస్మరించడం కుత్బుల్లాపూర్ ప్రజలను అవమానించడమేనని అన్నారు. ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా సంక్షేమం కోసం ఉండాలే తప్ప స్వార్థ రాజకీయల కోసం కాదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, మాజీ కార్పొరేటర్ జి.సురేష్‌రెడ్డి, మెట్రో సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు.

కులగణనపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

● జాజుల శ్రీనివాస్‌గౌడ్


సమావేశంలో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్, కుందారం గణేషాచారి తదితరులు

బర్కత్‌పుర, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 10 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి కులగణనపై చిత్తశుద్ధి లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశాచారి అధ్యక్షతన బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణనపై జీవో 26, జీవో 199లను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేయడమే కాక రూ.150 కోట్లను కేటాయించిందన్నారు. బీసీ కమిషన్ ఏర్పాటై నెలరోజులు గడిచినా ఇంత వరకు కులగణన చేయలేదని అన్నారు. కులగణనకు సంబంధించి ఇప్పటి వరకు గైడ్‌లైన్స్ విడుదల చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కులగణనపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ పద్ధతి మార్చుకోవాలని లేకపోతే బీసీల తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సంఘాల నేతలు బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్, రాంచందర్, కె.శ్రీనివాస్, ఎంఎస్. నరహరి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫక్రుద్దీన్ గుట్టపై జియో డైవర్సిటీ డే


డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సభ్యులు

నార్సింగ్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జియో డైవర్సిటీ డే సందర్భంగా డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ఆధ్వర్యంలో జియో హెరిటేజ్ ట్రయల్, టాక్ ఆన్ జియో డైవర్సిటీని గచ్చిబౌలి ఫక్రుద్దీన్ గుట్టపై ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డెక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ వేదకుమార్ హాజరై మాట్లాడారు. డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, ఇతర స్వచ్ఛంద సంస్థలతో కలిసి 2022 నుంచి అంతర్జాతీయ జియో డైవర్సిటీ డేను నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణలోని జియో హెరిటేజ్ సైట్లపై అవగాహన కల్పించేందుకు ఫక్రుద్దీన్ గుట్టను సందర్శించామని తెలిపారు. పాండవుల గుట్ట, భువనగిరి, దేవరకొండ, ఉండ్రుకొండ, బొమ్మలమ్మ గుట్టతో పాటు మరెన్నో రాతి కట్టడాలు, స్థలాలు, ప్రాంతాలను గుర్తించి, సంరక్షించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. అనంతరం మహేందర్‌రెడ్డి, జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ వేణుగోపాల్‌రావు, రామోజు హరగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎస్ ప్రసాద్, మహేందర్‌రెడ్డి, పర్యాటక శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ వైసుభాష్‌రెడ్డి, జనబ్ మహ్మద్ అఫ్జల్, ఇలియాస్‌ఖాన్, సేవ్‌నయాఖిల్లా, ధనుంజయ, నరహరి, శ్రీకృష్ణ, మహ్మద్ ఒమర్, అలీ, సర్ఫరాజ్, బస్వరాజ్, వెంకటనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముకరం ఝా సేవలు మరువలేనివి


పుస్తకావిష్కరణలో ప్రిన్సెస్ అస్రా, కౌన్సిల్ జనరల్ తుర్కి, ఓరహన్ యల్మాన్ ఒకన్, తదితరులు

చార్మినార్ అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ముకరం ఝా విద్యా, వైద్య రంగాలకు చేసిన సేవలు మరువలేమని తుర్కియే కౌన్సిల్ జనరల్ ఓర్ హాన్ యల్మాన్ ఓకాన్ అన్నారు. ఆదివారం ఎనిమిదవ నిజామ్ నవాబ్ మీర్ బర్కత్ అలీఖాన్ అలియాస్ ముకరం ఝా బహదూర్ జయంతి, పురానిహవేలీలోని ముకరం ఝా స్కూల్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముకరం ఝా సతీమణి ప్రిన్సెస్ అస్రా హాజరయ్యారు. హానరరీ కౌన్సిల్ జర్మనీ అమితా దేశాయి తదితరులు ముకరం ఝా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుల్తాన్ గాలిబ్ బిన్ అవద్ అల్ ఖాయితీ ఆంగ్ల పుస్తకం 'ది నిజామ్స్ సికందర్ జా నసీరుద్దౌలా అఫ్జలుద్దౌలా' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ముకరం ఝా ట్రస్టు ఫర్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ వారు ప్రచురించారు. ట్రస్టీ నవాబ్ అబుల్ ఫైజ్ ఖాన్ మాట్లాడారు. కార్యక్రమంలో నవాబ్ ఫైజ్ బిన్ జంగ్, ప్రిన్సిపాల్ రేఖా వాదే తదితరులు పాల్గొన్నారు.

యువ కళాకారులను ప్రోత్సహిస్తున్న నవ్యనాటక సమితి


నృత్యగురువును సత్కరిస్తున్న రమణాచారి తదితరులు

రవీంద్రభారతి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే శాస్త్రీయ సంగీతం, నృత్య రీతులలో జాతీయ స్థాయిలో 1961 నుంచి పోటీలు నిర్వహిస్తూ యువ కళాకారులను ప్రోత్సహిస్తున్న నవ్యనాటక సమితి ఆరున్నర దశాబ్దాల కృషి అపూర్వమైనదని రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ రమణాచారి అన్నారు. ఆదివారం రమణాచారి క్యాంపు కార్యాలయంలో నవ్యనాటక సమితి సంగీతం, నృత్య పోటీల నిర్వహణ అభినందన, సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య భూమిక పోషించిన నృత్యగురువులు నిష్టల సుధామాల, డా.పి.ఇందిరాహేమను ఆయన సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని అనేక రాష్ట్రాల నుంచి యువ కళాకారులను ఒకే వేదికపైకి చేర్చడం జాతీయ సమైక్యతకు నిదర్శనమన్నారు. 49వ జాతీయ సంగీతం, నృత్య పోటీలను విజయవంతంగా నిర్వహించినందుకు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో వసుంధర, విజయ్‌కుమార్, ఆచార్య ఫణీంద్ర, విశ్వనాథ్, నారాయణరావు, రమాదేవి, సుధారాణి పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వరుసకు సోదరి అయిన యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్‌కాలనికి చెందిన యువతి నర్సింగ్ కోర్సు పూర్తి చేసి గృహిణిగా ఉంటుంది. ఈ నెల 2న వరుసకు సోదరుడైన అనిష్ యువతి ఇంటికి వచ్చాడు. ఆమెతో మాట్లాడుతూ అసభ్యంగా ప్రవర్తించడం మొదలు పెట్టాడు. యువతి నివారించడంతో అతడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ నెల 5న బాధితురాలు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.



వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న యశోద ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి

ఆందోళనకరంగా క్యాన్సర్, క్షయ, న్యుమోనియా

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఊపిరితిత్తుల క్యాన్సర్, క్షయ, న్యుమోనియా ఆందోళన కలిగిస్తున్నాయని పల్మనాలజీ వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఊపిరితిత్తులకు చేసే సిటీస్కాన్‌లో లంగ్ నోడ్యూల్స్ ఎక్కువగా నిర్ధారణ అవుతున్నట్లు తెలిపారు. ఊపిరితిత్తుల కేన్సర్లను ముందుగా గుర్తిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చునని వారు పేర్కొన్నారు. 'నోడ్యూల్ సమ్మిట్ 2024' ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ లైవ్ వర్క్‌షాప్‌ను ఆదివారం హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆస్పత్రిలో క్లినికల్, ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ రంగంలో కొత్త ప్రమాణాలను తీసుకొచ్చామన్నారు. పల్మనాలజీ సీనియర్ వైద్యుడు వి.నాగార్జున మాట్లాడుతూ.. ఇటీవలి కాలంలో సిటీ స్కాన్‌ల వాడకం పెరగడంతో నోడ్యూల్స్‌ను గుర్తిస్తున్నామని, ఇది క్యాన్సర్ ప్రారంభ దశను సూచిస్తుందన్నారు. పల్మనరీ సమస్యలు దేశంలోని చాలా ప్రాంతాలను వేధిస్తున్నాయని, ఇప్పటికీ ఊపిరితిత్తుల క్యాన్సర్ దేశంలో మరణాలకు ప్రధాన కారణంగా ఉంటుందన్నారు. ప్రతి ఏడాది దాదాపు 25 లక్షల మంది ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నట్లు తెలిపారు. డాక్టర్ మషాహిదే ఓకీ (జపాన్), డాక్టర్ కైల్ హోగార్త్ (అమెరికా), డాక్టర్ యోన్ మింగ్ సాయ్ (తైవాన్), డాక్టర్ లిన్ షెంగ్ హావో (తైవాన్), డాక్టర్ ఎరిక్ డేనియల్ టెండా (ఇండోనేషియా) హాజరయ్యారు.

రాష్ట్రపతి నిలయంలో ముగిసిన కళామహోత్సవ్

తిరుమలగిరి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 8 రోజుల పాటు జరిగిన కళామహోత్సవ్ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఈ మహోత్సవ్ ఈశాన్య భారతంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు, సాంస్కృతిక ఔత్సాహికులను ఒక చోటుకు చేర్చిందని రాష్ట్రపతి నిలయం మేనేజర్ రజనీప్రియ తెలిపారు. సంప్రదాయ వస్త్రాలు, ఆధునిక ఉత్పత్తులను అందుబాటులో ఉంచినట్లు ఆమె వెల్లడించారు. కళామహోత్సవ్ 8వ రోజున ఏపీ, తెలంగాణ బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ కుటుంబ సమేతంగా సందర్శించారు. అలాగే టాసా మేజర్ జనరల్ రాకేష్ మనోచా కుటుంబం, నమిత సింగ్, పదాతిదళ విభాగానికి చెందిన జీఓసీ, సుదీప్తా ఝా, 54వ పదాతిదళ విభాగానికి చెందిన జీఓసీ సతీమణి, లెఫ్టినెంట్ కల్నల్ వీకే శర్మ కుటుంబంతో సహా సందర్శించారు. 8 రోజుల పాటు కొనసాగిన ఈ కళామహోత్సవానికి సుమారు లక్ష మంది విచ్చేశారు.



ఉత్పత్తులను పరిశీలిస్తున్న సందర్శకులు



తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్‌కు గుర్తింపు ఇవ్వాల్సిందిగా బీసీసీఐకి లేఖ రాయాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని అసోసియేషన్ అధ్యక్షుడు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ మాజీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని కిషన్‌రెడ్డి కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

- హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

రాజేంద్రప్రసాద్ కుమార్తె అంత్యక్రియలు పూర్తి

కేపీహెచ్‌బీకాలనీ, అక్టోబర్ 6 (ఆంధ్రజ్యోతి): సినీనటుడు రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి(38) అంత్యక్రియలు కుటుంబసభ్యులు, బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య ఆదివారం పూర్తయ్యాయి. కేపీహెచ్‌బీ ఇందూ విల్లాస్ నుంచి ఏడోఫేజ్‌లోని హిందూ శ్మశానవాటిక (కైలాసవనం)లో నిర్వహించారు. కొన్నేళ్లుగా తండ్రి ఉండే ఇంటి పక్కనే ఉన్న ఇందూ అపార్ట్‌మెంట్స్‌లోనే ఉన్న గాయత్రి కుటుంబం ఏడాది క్రితం సమీపంలోని ఇంకార్ వన్‌సిటీకి మారారు. దీంతో ఆ ప్రాంత వాసులు ఆమెను చివరిసారిగా చూసేందుకు తరలివచ్చారు. భర్త రాజ్‌కుమార్ గాయత్రి చితికి నిప్పుపెట్టారు.



కుమార్తె పార్థివదేహం వద్ద రోదిస్తున్న రాజేంద్రప్రసాద్



కూరలు కష్టమే!

(5వ పేజీ తరువాయి)

అయిదేళ్లలో ఈ ప్రాంతాల్లో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిపోయింది. కొన్ని ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కూడా నిలిచి పోవడంతో ఇబ్బందులు పడుతున్న రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. ఎక్కువ మంది పత్తి పంటను సాగు చేస్తున్నారు. గతంలో శివార్లలో ఉద్యాన పంటలను ప్రోత్సహించేందుకు ఉద్యాన జోన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు హామీ ఇచ్చాయి. కానీ ఇంత వరకు దీనిపై ఎలాంటి కదలికా లేదు. కనీసం ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ప్రోత్సాహకాలు ఇచ్చినా ఈ ప్రాంతంలో కూరగాయల సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ వాతావరణ పరిస్థితులు కూడా ఉద్యాన పంటలకు అనుకూలంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉద్యాన ప్రణాళికలు రూపొందించి శివార్లలోని కొన్ని గ్రామాల్లో ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన రైతులతో కూరగాయ పంటలు సాగు చేయించారు. విత్తన సబ్సిడీలు కూడా ఇచ్చారు. అయితే తరువాత ఈ ప్రయత్నాలు ముందుకు సాగలేదు. పాలీహౌజ్, నెట్‌హౌజ్‌లకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు కూడా గతంలోలాగా అందడం లేదు. దర ఖాస్తు చేసుకొని ఏళ్ల తరబడి వీటి కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.

మహిళను హత్య చేసి..

రేప్ సీన్‌గా మార్చి..

(5వ పేజీ తరువాయి)

భద్రంగా ఉంచుతానని మంజుల చెప్పింది. సెప్టెంబర్ మూడోవారంలో తన ఆభరణాలు ఇవ్వాలని అడగగా, మంజుల లేవని చెప్పడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గతనెల 29న ప్రియాంక ముగ్గురు పురుషులతో కలిసి మంజుల ఇంటికి వెళ్లి బెదిరించి తన వెండి ఆభరణాలను తీసుకుంది. మర్నాడు ప్రియాంకను ఇంటికి పిలిపించుకున్న మంజుల ఇద్దరం కలిసి ఉందామని నమ్మించి మద్యం తాగించింది. అదేరోజు రాత్రి 11 గంటల తర్వాత తన స్కూటీపై కేపీహెచ్‌బీ లోధా టవర్స్ ఎదురుగా ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లింది. కూర్చొని మాట్లాడుతూనే ప్రియాంకను కిందపడేసి గుండెలపై కూర్చొని తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో గొంతుకోసి చంపేసింది. షర్ట్, ప్యాంట్‌ను కూడా బ్లేడ్‌తో కోసేసి రేప్ జరిగినట్లుగా క్రియేట్‌చేసింది. ఈనెల 2న మహిళను అత్యాచారం చేసి హత్య చేశారన్న సమాచారం మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలు, సెక్స్ వర్కర్స్ తిరిగే ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు మంజులను అదుపులోకి తీసుకున్నారు. తన ఇంటిపైకి వచ్చి గొడవ చేసిన ప్రియాంక.. భవిష్యత్‌లో తనకు అడ్డు వస్తుందన్న అనుమానంతో తానే హత్య చేసినట్లు విచారణలో మంజుల అంగీకరించింది. పోలీసులు ఆమె నుంచి స్కూటీ, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. మంజులకు భర్త, రెండున్నర సంవత్సరాల పాప ఉన్నారు. ఈ కేసును త్వరితగతిన చేధించిన ఎస్‌వోటీతో పాటు అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాసరావు, ఎస్‌హెచ్‌వో కొత్తపల్లి ముత్తు, ఇతర పోలీస్ సిబ్బందిని డీసీపీ అభినందించి నగదు పారితోషికాలు అందించారు.

గోవా రైలుకు పచ్చజెండా

సికింద్రాబాద్ నుంచి ప్రారంభించిన.. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు అందుబాటులోకి రావడం తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వాస్కో డ గామా బై వీక్లీ రైలును ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్ నుంచి గోవాకు నేరుగా రైలు సర్వీసు లేదన్నారు. గతంలో గోవాకు వెళ్లాలంటే పలు స్టేషన్లలో రైళ్లు మారాల్సి వచ్చేదని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి నేరుగా గోవా వెళ్లే కొత్త రైలు కర్ణాటక వాసులకూ ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు వచ్చే ఏడాది పూర్తవుతాయని వెల్లడించారు. చర్లపల్లి స్టేషన్ పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. హైదరాబాద్, కాచిగూడ స్టేషన్లనూ ఆధునీకరిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

మెట్రో కారిడార్ 4, 9ను మార్చాలని బీజేపీ నేతల వినతి

హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు సంబంధించిన కారిడార్ 4, 9లో మార్పులు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్, పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. తాము ప్రతిపాదించిన రూట్‌లో ఈ కారిడార్లు ఏర్పాటు చేస్తే 35 కి.మీ. మేర దూరం తగ్గుతుందని, తద్వారా ప్రాజక్టు ఖర్చు కూడా తగ్గుతుందని చెప్పారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. "మెట్రో అధికారులు విడుదల చేసిన రూట్‌మ్యాప్ ప్రకారం కారిడార్ 4 నాగోల్ నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36 కి.మీ. ఉంటుంది. కారిడార్ 9శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఫోర్త్ సిటీ వరకు 40కి.మీ. ఉంటుంది. అంటే మొత్తం 76కి.మీ. మెట్రో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని బదులు నాగోల్-ఎల్బీనగర్-మందమల్లమ్మ-బాలాపూర్ చౌరస్తా-శివాజీ చౌక్-ఆర్‌సీఐ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-మహేశ్వరం గేట్-కందుకూరు ఫోర్త్ సిటీ వరకు మెట్రో లైను ఏర్పాటు చేస్తే 41 కి.మీ.తో పూర్తి చేయవచ్చు" అని శ్రీరాములు యాదవ్ వివరించారు. ఈ రూట్‌మ్యాప్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ఆయన సూచన మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మెట్రో ఎండీకి అందజేస్తామని శ్రీరాములు యాదవ్ పేర్కొన్నారు. కాగా, బంజారాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని మాజీ ఎంపీ సీతారాంనాయక్ డిమాండ్ చేశారు.



వాస్కో డ గామా రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

తెలంగాణ నుంచి మరిన్ని కథలు రావాలి

- ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్
- కథ-2023 సంకలనం ఆవిష్కరణ
- కథ కాల స్థితిగతులను రికార్డు చేస్తుంది: ప్రముఖ కవి శివారెడ్డి
- అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్: వాసిరెడ్డి

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 6: తెలంగాణ ప్రాంతం నుంచి మరింత విరివిగా కథా సాహిత్యం రావాల్సి ఉందని 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆకాంక్షించారు. వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ సంపాదకత్వంలో వెలువడిన కథ-2023 సంకలనాన్ని ఆయన ఆదివారం ఖమ్మంలోని జెడ్పీ సమావేశ మందిరంలో ప్రముఖ కవి కె.శివారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కవి, విద్యావేత్త రవి మారుత్ అధ్యక్షతన జరిగిన సభలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం నుంచి మంచి కథకులు, కథలు వస్తున్నా ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ సంఖ్య కొంత తక్కువగానే ఉందన్నారు. సంకలనాల ప్రచురణకర్తలు ప్రాంతాల సమతుల్యాన్ని పాటిస్తే మంచిదన్నారు. సమాజంలో వస్తున్న అనేక మార్పులను కథకులు తమ వస్తువులుగా ఎంచుకుంటుండటంతో కథ భవిష్యత్ తరాలకు చరిత్ర అవుతుందన్నారు. కథా సంకలనాల్లో ప్రాంతీయ సమతుల్యం లేకపోతే ఈ ప్రాంతంలో మంచి కథకులు, కథలు లేవన్న అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 1910ల్లోనే తెలంగాణ ప్రాంతం నుంచి కథలు వచ్చాయని, 1917 వరకు విస్తృతి పెరిగి వందల కథలు వచ్చాయన్నారు. కథా సంకలనం సిరీస్‌ను గత 34 ఏళ్లుగా నిరాటంకంగా నిర్వహిస్తుండటం సాధారణ విషయం కాదన్నారు. కథ కాల స్థితి గతులను రికార్డు చేస్తుందని కే శివారెడ్డి అన్నారు. ప్రపంచంలో ఏ మార్పులు సంభవిస్తున్నాయో కథకులు తమ కథల్లో రికార్డు చేస్తున్నారని చెప్పారు. వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ 'షార్ట్ స్టోరీస్' పేరుతో అమెరికాలో 1915లో మొదలైన సిరీస్ ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. అమెరికా తరువాత తెలుగులోనే కథా సంకలనాల సిరీస్ వస్తోందన్నారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ కథల ఎంపికలో తాము ప్రాంత, వర్గ, కుల భేదాలు చూడబోమన్నారు. ప్రముఖ సాహితీవేత్త ముప్వా శ్రీనివాసరావు తదితరులు ప్రసంగించారు. ఈ కథలను ప్రముఖ విశ్లేషకురాలు పీ జ్యోతి పరిచయం చేశారు.



కథ-2023 సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, చిత్రంలో ప్రముఖ కవి కే శివారెడ్డి తదితరులు

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

హనుమకొండ జిల్లాలోని ఓ పత్తి చేనులో దుర్ఘటన .. ఇంటర్ విద్యార్థిని, యువ రైతు మరణం

ఐనవోలు/నెల్లికుదురు/హైదరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురువగా.. పిడుగుపాటు వల్ల హనుమకొండ జిల్లాలో ఓ ఇంటర్ విద్యార్థిని సహా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, ఐదుగురు గాయపడ్డారు. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురానికి చెందిన కుకట్ల రాజుయాదవ్ (25) దౌతుబాజి శ్రావణి(17), కుకట్ల కోమల(రాజు యాదవ్ తల్లి) సహా ఏడుగురు కలిసి గ్రామ శివారులోని పత్తి చేనులో పత్తి ఏరుతున్నారు. అయితే, మధ్యాహ్నం మూడు గంటల సమయంలో భారీ వర్షం పడడంతో అందరూ సమీపంలోని ఓ రేకుల షెడ్డు కిందకి వెళ్లారు. పది నిమిషాల వ్యవధిలో ఆ షెడ్డుపై పిడుగుపడగా అంతా స్పృహ కోల్పోయారు. కాసేపటికి తేరుకున్న కొందరు ఇతరులను లేపేందుకు ప్రయత్నించగా రాజుయాదవ్, శ్రావణి ప్రాణాలు కోల్పోయారు. రాజుయాదవ్ తల్లి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. శ్రావణి జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతుంది. యువ రైతు అయిన రాజు అవివాహితుడు. ఇక, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెంలోని గ్రీన్ ఫీల్డ్ హైవే క్యాంపు కార్యాలయంలో ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆర్.సింగారం సెల్‌ఫోన్ మాట్లాడుతుండగా పిడుగుపాటుకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. సింగారం స్వస్థలం తమిళనాడులోని వెల్లూరు.. మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సింగారం పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.



రాజుయాదవ్



శ్రావణి (ఫైల్)

నేడు, రేపు వర్షాలు..

రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో అక్కడక్కడా మోస్తారు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వికారాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మెదక్, కామారెడ్డి, సిద్దిపేట, జనగాం, హనుమకొండ, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, జనగాం, వరంగల్, యాదాద్రి జిల్లాలకు సోమవారం ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా, ఆదివారం జనగామలో 3 సెంటీమీటర్ల వర్షపాతం కురవగా, భద్రాద్రి జిల్లా దుమ్ముగూడెంలో అత్యధికంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.